క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ప్యారేజాన్ సాబ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్యారేజాన్ సాబ్ (68) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా సంయుక్త కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు ప్యారేజాన్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించార. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్యారేజాన్ సాబ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి వెంట సర్పంచ్ కరుణాకర్, మాజీ సర్పంచ్ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

17న స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

రొళ్ల: మండలంలో ఈ నెల 17, 19వ తేదీల్లో రెండు రోజుల పాటు అలుపనపల్లి, హొట్టే బెట్ట, రత్నగిరి, బీజీ హళ్లి, రొళ్ల, హెచ్‌టీ హళ్లి ఉన్నత పాఠశాల ఆవరణలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. సమావేశాలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఒక్కొక్క రోజు సగం మంది (50 శాతం) ఉపాధ్యాయులు హాజరు కావల్సి ఉంటుందన్నారు.

లేపాక్షి ఆలయంలో పూజలు



అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: వీరభద్ర స్వామి దేవాలయంలో దుర్గాదేవి, వీరభద్రస్వామివార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివార్లను దర్శించుకున్నారు.

నీరు విడుదల చేయండి



ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న జలసాధన సమితి నాయకులు

హిందూపురం అర్బన్: గొల్లపల్లి ప్రాజెక్ట్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువులకు మొదటి దశలోనే నీరివ్వాలని జల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హంద్రీనీవా ప్రాజెక్ట్ ఎస్ఈ దేశానాయక్‌కు అనంతపురంలో వినతిపత్రం అందించినట్లు జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

పావగడ: సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే సభ్యులందరూ సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తెలిపారు. తాలూకాలోని నిడుగల్ హోబళి కేటీ హళ్లిలో శుక్రవారం జరిగిన వీఎస్ఎస్ఎన్ సంఘం సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన గిడ్డంగిని ప్రారంభించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగేగౌడ మాట్లాడుతూ సహకార సంఘాన్ని అభివృద్ధి చేసి కేటీ హళ్లి వీఎస్ఎస్ఎన్ సంఘాన్ని తాలూకాలోనే ఉత్తమ సహకార సంఘంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఈఓ నాగరాజు, డీసీసీ బ్యాంకు అధికారులు నాగేంద్ర, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి ఆవరణంలో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమస్యలతో పాటు ఆస్పత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై కూడా చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు డాక్టర్లు, సిబ్బంది, అందుబాటులో ఉండాలన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండుతో పాటు హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో తాగునీటి పథకాలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శుక్రవారం ప్రారంభించారు.

వైద్య విద్యపై రాజకీయం వద్దు



కూటమి ప్రభుత్వం వైద్య విద్యపై రాజకీయం చేస్తుండటం శోచనీయం. ఈ జిల్లాకు వైద్య కళాశాల చాలా అవసరం. ఇది పూర్తయితే ఎంతో మంది నిరుపేద విద్యార్థులు వైద్య విద్య చదివేందుకు ఆస్కారం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరతతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సీఎం చంద్రబాబు ప్రైవేటు విధానాన్ని పక్కన పెట్టి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలి. రాజకీయాలు కన్నా విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమని గుర్తించాలి.

– విశ్వనాథరెడ్డి, ఆర్ఎంపీ, కొడికొండ చెక్‌పోస్ట్



పనులు నిలిపేయడం సబబు కాదు



ప్రభుత్వాలు ఏవైనా విద్యాపరంగా అభివృద్ధికి సంబంధించిన విషయాల్లో వివక్షత చూపకూడదు. ఇలాంటి నిర్ణయాల వల్ల పేద, మధ్య తరగతికి చెందిన పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెనుకొండ దగ్గర మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను మొదలు పెట్టింది. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆ పనులు నిలిపి వేయడం సమంజసం కాదు. ఈ మెడికల్ కళాశాల పూర్తయితే ఎంతో మంది పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో మెడిసిన్ చదవచ్చు.

– వెంకటేష్ ,ఆర్.అనంతపురం, మడకశిర మండలం




నిమజ్జనానికి తరలుతున్న శివరూపధారి, గదాధారి గణపయ్యలు



హిందూపురం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో సాగుతున్న శోభాయాత్ర



భక్తులతో కిక్కిరిసిపోయిన పురం ప్రధాన రహదారి



మెయిన్ బజార్‌లో అన్నదానం చేస్తున్న మార్వాడీలు



గురునాథ్ సర్కిల్‌లో అరటి పండ్లు, నీళ్లు అందిస్తున్న అఖిల భారత షహీద్ టిప్పూ సుల్తాన్ యునైటెడ్ మిత్ర బృందం



వెయ్.. చిందెయ్..



అంబేద్కర్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

బై బై గణేశా



హిందూపురం/హిందూపురం అర్బన్: గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా.. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదాలతో హిందూపురం పట్టణం మార్మోగింది. శుక్రవారం సాయంత్రం నుంచి చేపట్టిన గణేష్ నిమజ్జనం ఆద్యంతం భక్తిపారవశ్యం మధ్య సాగింది. ప్రధాన వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎటు చూసినా వినాయక విగ్రహాలే దర్శనమిచ్చాయి. పోలీసుల భారీ బందోబస్తు మధ్య శోభాయాత్ర ప్రశాంతంగా సాగింది. శనివారం తెల్లవారుజాము వరకూ గుడ్డం కోనేరులో గణేష్ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది.

జోరుగా సేవా కార్యక్రమాలు

శ్రీసత్యసాయి జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు హిందూపురానికి తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులు ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో పెద్ద ఎత్తున అన్నదానం, నీటిసదుపాయాన్ని కల్పించారు. అంబేద్కర్‌సర్కిల్‌లో సాయిప్రతాప్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అలాగే బైపాస్‌రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేష్ , చంద్ర తదితరులు అన్నదానం చేశారు. అన్ని ప్రధాన కూడళ్లలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పులిహోరా, నీళ్లు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్‌ను పంపిణీ చేశారు. బందోబస్తుకు వచ్చిన పోలీసులకు సీఅండ్ఐజీ చర్చి ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు.



టపాసుల మోత ఇలా..




యువతుల సందడి



హిందూపురం పట్టణంలోని గుడ్డం కోనేరులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

హిందూపురం అర్బన్: విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత సంపాదించాలని మంత్రి సవిత విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీలో రాష్ట్ర సబ్‌జూనియర్ అండర్ 16 బాలుర , బాలికల చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుచ్చయ్యచౌదరి క్రీడాకారులు పాల్గొన్నారు.

పరిగి: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేతజౌళీశాఖ మంత్రి సవిత శుక్రవారం మండలంలో పర్యటించారు. కొడిగెనహళ్లిలో సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పరిగిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి సవిత మాట్లాడుతూ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, పాఠశాలల కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించగా పరిగి మండలంలో రూ.4.50 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రోటోకాల్ పాటించరా?

మంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ పాటించడం లేదని ఆయా గ్రామాల సర్పంచులు లక్ష్మీదేవి, సాకమ్మతో పాటూ ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు అధికార పార్టీ నేతలకు తలొగ్గి ప్రోటోకాల్ నిబంధనలను తుంగలో తొక్కడమేంటని ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమాలపై తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు.

23 నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈనెల 23 నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు స్కిల్ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9676706976ను సంప్రదించాలన్నారు.



↑ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

అ‘పూర్వ’సమ్మేళనం

పావగడ: తాలూకాలోని కోటగుడ్డ గ్రామంలోని కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం సందడిగా జరిగింది. 2003 నుంచి 2006 మధ్య పీయూసీ పూర్తి చేసిన విద్యార్థులంతా ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు వెయ్యి నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

వాటర్ క్యాన్ల పంపిణీ

పెనుకొండ: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శుక్రవారం 30 వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోపాలరెడ్డి, మనీషా, ప్రిన్సిపాల్ సుదర్శన్, హఫీజ్, శివన్న, జనార్దన్, రామచంద్రయ్య, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల: మండలవ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇంజినీర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నామన్నారు.

మడకశిర సీఐగా రామారావు



మడకశిర: మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా శుక్రవారం రామారావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిక్షణకు ప్రాధాన్యతం ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సోమందేపల్లి: కమ్యూనిస్ట్ నాయకుడు సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమందేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. సీపీఎం నాయకులు రాజగోపాల్, రంగప్ప, నారాయణ స్వామి, చాంద్‌బాష, లక్ష్మీనారాయణ, మాబూ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. హరేసముద్రం పంచాయతీలోని ఉపార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయితీస్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో పౌష్టిహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

పావగడ: పట్టణంలోని ఆదర్శనగర్‌లో భార్గవ్ అనే వ్యక్తిపై చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో నరసింహమూర్తి, హరికుమార్, నరసింహలను అదుపులోకి తీసుకొని జైలుకు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు. గురువారం రాత్రి మరిగమ్మ ఆలయం రోడ్డు వద్ద కూర్చొని మహిళ విషయంలో భార్గవ్‌తో గొడవ పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే తీవ్రంగా గాయపరచినట్లు చెప్పారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

అగళి: మండలంలో ఈ మధ్యకాలంలో డెంగీతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలని మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రవి ప్రసాద్‌కు సూచించారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో పాటు ఆదర్శ పాఠశాలను సందర్శించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి

మడకశిరరూరల్: విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని రూరల్ సీఐ రాజ్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని ప్రభుత్వ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినిదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయండి

పెనుకొండ: మండలంలోని గోనిపేటలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని జేవీవీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సెల్‌టవర్ లేకపోవడంతో ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో హరి, బాబావలి, ఆటో వెంకటేష్, నాగరాజు, ఆది తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ సీజ్



గుడిబండ: మండల పరిధిలోని కొంకల్లు క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీని శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. ఎలాంటి రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించామన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: విద్యార్థులు పరిశుభ్రతను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని హెచ్ఎం హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రత్నగిరి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత పాటించడంతో కలిగే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం హరిప్రసాద్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్య శుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన

మడకశిర: మడకశిర ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని కడప ఆర్‌జేడీ నాగలింగారెడ్డి అధ్యాపకులను కోరారు. ఆయన శుక్రవారం మడకశిర డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు.

స్థల పరిశీలన

గుడిబండ: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, కదిరి కళాశాల ప్రిన్సిపాల్ స్మిత, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌భూపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. గుడిబండ వారపు సంతకు సమీపంలో ఉన్న 11 ఎకరాల ప్రభుత్వ భూమిని చూశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేసి సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



గుడిబండలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి